క్లుప్తంగా

సిరులతల్లికి సహస్ర తులసిపూజ



భక్తుల పూజలందుకున్న కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం ఘనంగా సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

దోమలు బాబోయ్..



మురుగు కాల్వలో పేరుకుపోయిన చెత్త

దాబాగార్డెన్స్: అపారిశుద్ధ్యం కారణంగా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయంటూ జీవీఎంసీ 29వ వార్డు పరిధి మహారాణిపేట హోటల్ గేట్‌వే వెనుక భాగాన స్థానికంగా ఉంటున్న పలువురు నివాశితులు లబోదిబోమంటున్నారు. కాల్వల్లో చెత్త పేరుకుపోయి కొద్ది రోజులుగా దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో విషజ్వరాలు ప్రబలుతున్నాయని, ఇప్పటికే ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు జ్వరాల బారిన పడ్డారని, అధికారులు స్పందించి ఎప్పటికప్పుడు చెత్త తీసి, దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నేడు ప్రజాదర్బార్

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం పలు వార్డులకు సంబంధించి ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఏవీఎన్ కాలేజీ జామియా మసీదు వద్ద ఈ కార్యక్రమం చేపట్టనున్నారు. అలాగే ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 32, 33, 34 వార్డులకు సంబంధించి మనోరమ థియేటర్ వద్ద నిర్వహించనున్న ప్రజాదర్బార్‌లో స్థానిక సమస్యలు తెలుసుకోనున్నారు. జామియా మసీదు వద్ద ముస్లింల కోసం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో ముస్లిం సమస్యలు తెలపవచ్చు.

శౌర్య పురస్కార గ్రహీతకు అభినందనలు



సాహితీ వినూత్నను అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : ఇటీవల న్యూఢిల్లీలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ చైల్డ్ వెల్ఫేర్ అందించిన జాతీయ శౌర్య పురస్కారం 2020 పొందిన మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థిని పోతాప్రగడ బీఎస్ఎస్ సాహితీ వినూత్నను ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు అభినందించారు. 25 జనవరి 2020లో కాలువలో బస్సు బోల్తా పడిన ఘటనలో తన స్నేహితురాలు, ఒక ఉపాధ్యాయురాలితో పాటు ఆరుగురు వృద్ధులను కూడా రక్షించడంలో తెగువ చూపిన ఆమె ధైర్యానికి ప్రతిష్టాత్మక జాతీయ శౌర్య పురస్కారం లభించింది. 2023 శతాబ్ది సంవత్సరంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ఇటువంటి విద్యార్థినిని కలిగి ఉండటం గర్వంగా ఉందని ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు ఆనందం వ్యక్తం చేశారు.

సమీక్షలు.. సమావేశాలతో సరి

- ఆర్‌వోల పనితీరుపై సర్వత్రా వెల్లువెత్తుతున్న విమర్శలు
- రెవెన్యూ వసూళ్లలో వెనుకంజ



జీవీఎంసీ జోన్-4 కార్యాలయం

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో రెవెన్యూ ఆర్‌వోల పనితీరుపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సూర్యాబాగ్ వద్ద ఉన్న ఈ కార్యాలయంలో జోనల్ కమిషనర్‌తో పాటు రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, యూసీడీ, పబ్లిక్ హెల్త్ తదితర కార్యాలయాలు ఉన్నాయి. ఇన్ని ఉన్నా జీవీఎంసీకి ప్రధాన ఆదాయ వనరు అయిన రెవెన్యూ మాత్రం వెనుకబడిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో ఇద్దరు ఆర్‌వోలు, ఒక ఆర్‌ఐ ఉండేవారు. అప్పుడు జోన్-4 మొత్తం అన్ని జోన్లకంటే రెవెన్యూ వసూళ్లలో రెండవ స్థానంలో ఉండేది. ఇప్పుడు ఇద్దరు ఆర్‌వోలు, ఇద్దరు ఆర్‌ఐలు ఉన్నా ఆరవ స్థానానికి దిగజారిపోయిందంటే ఆర్‌వోల పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

సెక్రటరీలకు చుక్కలు..

వాస్తవానికి జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ సెక్రటరీలతో సమావేశాలు నిర్వహించి వారు సక్రమంగా విధులు నిర్వర్తించడానికి మార్గనిర్దేశం చేస్తారు. ఎవరు ఏ విభాగంలో వెనుకబడి ఉన్నారో వారిని ప్రోత్సహిస్తూ మంచి పనితీరు కనబరిచేలా చర్యలు తీసుకుంటారు. అయితే ఇక్కడ మాత్రం ఆర్‌వోలే ప్రధానంగా వ్యవహరిస్తున్నారు. రోజూ సెక్రటరీలు, అడ్మిన్‌లకు సమావేశాలు నిర్వహిస్తూ వారితో పనులు చేయిస్తున్నారు. ఆర్‌వోలు బయటికి వెళ్లకుండా సెక్రటరీలతోనే పనులు చేయిస్తూ కాలక్షేపం చేస్తున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. గతంలో ఇదే విధంగా వ్యవహరించిన జెడ్సీని ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేసిన సంగతి తెల్సిందే. అయితే ఆర్‌వోలు కూడా ఇదే చేస్తూ సెక్రటరీలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అంటున్నారు. వివిధ పనుల మీద వచ్చే ప్రజలకు ఆర్‌వోలకు బదులు ఇక్కడి ఖాళీ కుర్చీలు కనబడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఎక్కడికి వెళ్లారని ప్రశ్నిస్తే ఫీల్డ్‌కు వెళ్లారని.. ఫీల్డ్‌లో ప్రశ్నిస్తే కార్యాలయానికి వెళ్లారంటూ ప్రజలను మభ్యపెడుతున్నట్లు చెబుతున్నారు.

సమీక్షిస్తాం..



వచ్చే రెండు నెలల్లో రెవెన్యూ వసూలు పెరుగుదలకు కృషి చేస్తాం. ఆర్‌వోల పనితీరుపై సమీక్షిస్తాం. రెవెన్యూ వసూలుకు సంబంధించి సెక్రటరీలు, ఆర్‌వోలు తప్పకుండా ఫీల్డ్ వర్కు చేయాల్సిందే. అందుకే వారికి జీవీఎంసీ వాహనాలు ఇచ్చింది. లేని పక్షంలో వాహనాలు వెనక్కి తీసుకుంటాం. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్తాం.

–కె.శివప్రసాద్, జోన్–4 జోనల్ కమిషనర్.

వసూళ్లపైనే శ్రద్ధ

- సమస్యల పరిష్కారంపై ఏదీ దృష్టి?
- జీవీఎంసీ తీరుపై పూర్ణామార్కెట్ వ్యాపారులు, వినియోగదారుల అసంతృప్తి



పూర్ణామార్కెట్ రహదారిలో ఏర్పాటు చేసిన దుకాణాలు తీయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో సొమ్మొకరికి.. కష్టం మరొకరికి అన్నట్లు తయారయింది పరిస్థితి. నగరంలో కీలకమైన వాణిజ్య సముదాయం పూర్ణామార్కెట్ జీవీఎంసీ ఆధీనంలో ఉంది. ఈ మార్కెట్ నుండి ప్రతి సంవత్సరం రూ. లక్షల్లో ఆదాయం జీవీఎంసీకి వస్తుంది. ఈ ఏడాది ఆశీలు వసూళ్లు జీవీఎంసీ జోన్-4 అధికారులు చేపట్టారు. రోజూ సెక్రటరీలు, కార్యాలయ సిబ్బంది కలిసి వసూలు చేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. అసలు విషయం ఇక్కడే మొదలవుతుంది. ఆశీలు పాట పాడుకున్న కాంట్రాక్టర్లు కొంచెంలో కొంచెం అయినా వాహనాల పార్కింగ్ వద్ద ఉండి వినియోగదారులు, వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తుంటారు. కానీ ఈ ఏడాది కాంట్రాక్టర్లు లేకపోవడంతో కార్యాలయ సిబ్బందే ఆశీలు వసూలు చేస్తున్నారు. దీంతో మార్కెట్ వద్ద పార్కింగ్ కష్టాలు ఎక్కువయ్యాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. రహదారిపై దుకాణాలు కూడా ఇష్టానుసారంగా ఏర్పాటు చేయడంతో ఈ సమస్య మరింత జటిలమయిందని చెబుతున్నారు. ఈ దశలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు జరకుండా చూసుకోవడమే కాకుండా రోడ్లపై ఆక్రమణలను కూడా తొలగిస్తూ అదనపు విధులు నిర్వర్తిస్తున్నారు. ఆశీలు వసూలు చేస్తున్న జీవీఎంసీ మాత్రం కనీసం పట్టించుకోకపోవడంతో పూర్ణామార్కెట్ ప్రాంతంలో తలనొప్పిగా మారిందని పోలీసులు, వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆశీలు వసూలుపై ఉన్న శ్రద్ధ.. ఇక్కడి సమస్యల పరిష్కారంలో కూడా చూపిస్తే బాగుంటుందని వ్యాపారులు, వినియోగదారులు అంటున్నారు.

లలితా పీఠంలో సంకటహర చతుర్థి



గణపతికి పూజలు చేస్తున్న అర్చకులు



లక్ష్మీగణపతి హోమం చేస్తున్న పండితులు

అక్కయ్యపాలెం: సంకటహర చతుర్థి సందర్భంగా గురువారం సాయంత్రం లలితానగర్ లలితా పీఠంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. గణపతికి ప్రీతిపాత్రమైన తిథుల్లో చతుర్థి ఒకటని, మనుషులను కష్టాల నుంచి గట్టెక్కించేది ఈ వ్రతం ఎంతో విశిష్టమైనదని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. పీఠం అర్చకుల మంత్రోచ్చారణల నడుమ దూప దీప నైవేద్యం, గణేశ స్తోత్రం, వ్రత కథ చదివారు. అనంతరం పీఠం దర్బారు హాల్లో శాస్త్రోక్తంగా గణపతి హోమం నిర్వహించారు.

ఈ హోమం వల్ల కార్యసిద్ధి, ఆరోగ్యం, విజయం లభిస్తాయని అర్చకులు చెప్పారు. పంచమి సందర్భంగా శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు వారాహి హోమం జరుగుతుందని కృష్ణసేన్ తెలిపారు.

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



జీలకర్ర బెల్లం ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ పుష్పార్చన సేవ నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణ మండపంపై అధిష్టింపజేసి, 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి జరిపారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, అప్పాజీ తదితరులు ఈ సేవ నిర్వహించారు.

- సింహాద్రి అప్పన్న స్వామికి గురువారం నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను వేయింపజేసి విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కనుల పండువగా సాగింది. పూజల్లో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

పార్వతీశ్వరుడి కల్యాణోత్సవం నేడు



పార్వతీశ్వరుల ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానం జరిపిస్తున్న అర్చకులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట గణేష్‌నగర్‌లో కొలువైన పార్వతీశ్వర స్వామి 33వ వార్షిక కల్యాణ మహోత్సం శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. పలు రకాలతో పండ్లతో చూడముచ్చటగా కల్యాణ వేదిక సిద్ధం చేశారు. దీనిలో భాగంగా ఆలయ అర్చకులు గురువారం ఉదయం పార్వతీశ్వరుల ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానం జరిపించారు. కల్యాణోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం 9.30 గంటలకు గణపతి పూజ, పుణ్యావచనం, పంచగవ్యప్రాసన, అస్త రాజార్చన, వాస్తుపూజ, అంకురార్పణ, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్టాపన నిర్వహిస్తామని ఆలయ అర్చకుడు గంగవరపు శివాజీశర్మ తెలిపారు. సాయంత్రం 6 గంటలకు పార్వతీశ్వరుడి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపిస్తామన్నారు. స్వామి కల్యాణ మహోత్సవం చేయించుకునే దంపతులు రూ.516, గోత్ర నామాలతో పూజ చేయించునే వారు రూ.116 ఆలయ సిబ్బందికి చెల్లించాలని చెప్పారురు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతమ్మధార: ఏపీఈపీడీసీఎల్ జోన్-1 పరిధి డాక్టర్స్ కాలనీ, 33/11 కేవీ ఎంఎంటీసీ సెక్షన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ జి.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్స్ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, ఏఎస్ ఎన్‌క్లేవ్, వైజాగ్ హట్స్, సీతమ్మధార, అల్లూరి సీతారామరాజు జంక్షన్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

కేజీహెచ్ సూపరింటెండెంట్‌కు అభినందనలు



డాక్టర్ అశోక్‌కుమార్‌ను అభినందిస్తున్న ఏవీఎన్ కాలేజీ పూర్వ విద్యార్థులు

మహారాణిపేట : కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ అశోక్‌కుమార్ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఏవీఎన్ కాలేజీ 1980–82 బ్యాచ్‌లో ఆయన మిత్రులు, సహ విద్యార్థులు గురువారం ఆయనకు అభినందనలు తెలిపారు. సహ విద్యార్థులైన లగుడు విజయ్‌కుమార్ (కేజీహెచ్), తులసిగిరి (రెండో పట్టణ ఎస్ఐ), నిష్ట విజయశంకర్ (న్యాయవాది), గిరిజాశంకర్ (ఎల్ఐసీ), రామారావు (పోర్టు ట్రస్టు), హరిభాస్కర్ (రైల్వే), బాబాజీ(కేజీహెచ్) తదితరులు అభినందించి, సత్కరించారు

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, జెడ్సీ శివప్రసాద్

అల్లిపురం: జీవీఎంసీ 33వ వార్డు పరిధిలో బంగారుమెట్ట వద్ద వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి పలు అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డులో పలు ప్రాంతాల్లో సీసీ కాలువల నిర్మాణానికి గాను కౌన్సిల్‌లో ఆమోదింపజేసుకుని వార్డుని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గం జనసేన నాయకుడు భీశెట్టి గోపాలకృష్ణ, జోనల్ కమిషనర్ పి.శివప్రసాద్, ఏఈ ఎండీ షమీమ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురుదేవ్, ఎమినిటీస్ సెక్రటరీలు, యజ్ఞశ్రీ, గ్రామ పెద్దలు బంటుపల్లి రామకృష్ణ, భీశెట్టి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాలు

ఆరిలోవ: చినగదిలిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయ 10వ వార్షికోత్సవాలు శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఈ ఆలయాన్ని కమిటీ సభ్యులు సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుద్దీపాలు, పచ్చని కమ్మలతో అలంకరించారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు ఆలయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ చీఫ్ సెక్రటరీ వానపల్లి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. 11న ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సాయంత్రం పురవీధుల్లో బాబా రథోత్సవం, 12న ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఏకాహం, ఓం సాయి, శ్రీసాయి, జైజై సాయి అనే మాల మంత్ర ఉచ్ఛారణ కార్యక్రమం జరుగుతుందన్నారు. 13న ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కలశ పూజ, 11 గంటలకు బాబాకు అన్నాభిషేకం, మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ, సాయంత్రం పల్లకి సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. బాబా దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై వెనక్కి తగ్గాలి

మద్దిలపాలెం: లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలు పన్నులు చెల్లిస్తున్న విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం డిమాండ్ చేశారు. పిఠాపురం కాలనీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ విక్రయానికి ఒక ఏజెంట్‌గా బీజేపీ ఎంపీ జీవీఎల్ నర్సింహారావు వ్యవహరించడాన్ని మానుకోవాలని హితవు పలికారు. ఉత్తరాంధ్రపై అమితమైన ప్రేమ ఉన్నట్టు జీవీఎల్ వ్యవహరించడం అనుమానాస్పదంగా ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయింపుపై ఏనాడు చర్చించలేదన్నారు. కావాలనే స్టీల్‌ప్లాంట్ నష్టాలను చూపిస్తున్నారని ఆరోపించారు. ప్లాంట్ ఏర్పాటు చేసినప్పుడు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి కేవలం రూ.5వేల కోట్లు అని, పన్నుల రూపంలో ఇప్పటి వరకూ రూ.52 వేల కోట్లు అందుకున్న విషయాన్ని దాచిపెడుతున్నారన్నారు. ఎంపీ జీవీఎల్ స్టీల్‌ప్లాంట్‌పై సవతి ప్రేమ చూపిస్తూ దాన్ని నష్టాలను భర్తీ చేసుకోవడానికి హెచ్‌బీ కాలనీలోని స్టీల్‌ప్లాంట్ క్వార్టర్లు ఉన్న 20 ఎకరాల భూమిని ప్రైవేటు వ్యక్తులు ఇవ్వాలని సూచించడం సమంజసంగా లేదన్నారు. అదాని, అంబానీలకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న కేంద్రం.. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.6వేల కోట్లు ఇవ్వడానికి ఎందుకు వెనుకడుగు వేస్తుందని ఆయన ప్రశ్నించారు. పార్టీ నగర కార్యదర్శి జగ్గునాయుడు, కార్యవర్గ సభ్యుడు ఆర్కే ఎస్వీ కుమార్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద సంస్థలో ఉచిత వైద్య సేవలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సూర్యతేజ

దాబాగార్డెన్స్: పాతనగరంలో గల స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థలో గురువారం ఉచితంగా బీపీ, షుగర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి నెలా రెండో గురువారం స్నేహ సంధ్యా ఏజీకేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యతేజ మాట్లాడుతూ సంస్థలోని వృద్ధులతో పాటు పరిసర ప్రాంతాల్లో గల నిరుపేదలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు తెలిపారు. క్రమ పద్ధతిలో మందులు వాడాలని, అలాగే శరీరానికి తగిన వ్యాయామం కూడా అవసరం అన్నారు. సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ వైద్య శిబిరానికి వచ్చిన పేషెంట్లకు అల్పాహారం అందించామన్నారు. ఈ ఉచిత వైద్య సేవలు నిరుపేదలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాదు నాయుడు, పుండరీకాక్ష, రమణ, సుమతి, లావణ్య, అనూష, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'మానవత-నైతికత'పై రాష్ట్రవ్యాప్త జాగృతి ఉద్యమం



జాగృతి ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

దాబాగార్డెన్స్: జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 20 వరకు 'మానవత-నైతికత'పై రాష్ట్రవ్యాప్తంగా జాగృతి ఉద్యమం చేపట్టనున్నట్లు సంస్థ ప్రతినిధులు షేక్ మక్బూల్, జియా ఆలీఖాన్, మహ్మద్ ఇబ్రహీం తెలిపారు. ఈ మేరకు గురువారం నగరంలోని మహారాణిపేటలో గల ఇస్లామిక్ ఇన్ఫర్మేషన్ కార్యాలయంలో జాగృతి ఉద్యమ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు మనిషి వైజ్ఞానిక అభివృద్ధిలో దూసుకుపోతున్నా, మానవతా విలువలు నానాటికీ దిగజారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం నిత్యం అశాంతి, అలజడికి గురవుతుందని, అందుకు నిదర్శనం నేడు సమాజంలో పెరిగిపోతున్న నేరాలు, మారణహోమాలేనని పేర్కొన్నారు. మనిషిలో నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవతా విలువలు వికసిస్తాయని, దైవభీతి, జవాబుదారీతనం వల్లనే మనిషిలో అవసరమైన మానవీయత, నైతికత జనిస్తాయని తెలిపారు. సమాజంలో ఈ భావన పెంపొందించే ఉన్నత లక్ష్యంతోనే ఇస్లామి హింద్ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి ఉద్యమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఉద్యమంలో భాగంగా సామాజిక, రాజకీయ, వివిధ ప్రత్యేక రంగాలకు సంబంధించిన ప్రముఖులతో చర్చా గోష్టులు, రౌండ్ టేబుల్ సమావేశాలు, ఆధ్యాత్మిక గురువులతో సమావేశాలు, వ్యక్తిగత పరిచయాలు, కరపత్రాలు, పోస్టర్ల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో నిర్వాహకులు మహ్మద్ ఇబ్రహీం, షేక్ సిరాజ్, రహ్మతుల్లా, బషీరుద్దీన్, డాక్టర్ యాసీన్‌ఖాన్, హమీద్ బాష, వాజిద్ రజా, అబ్దుల్ సలాం, అహ్మద్, షేక్ బాజీబాబా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళారంగ ప్రముఖులు

దాబాగార్డెన్స్: స్వర గీతిక సాంస్కృతిక సంగీత సంస్థ ఆధ్వర్యంలో 'ఒకసారి కలలోకి రావయ్యా' పేరిట 3 గంటల పాటు నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించిన సంగీత విభావరిని కళారంగ ప్రముఖులు సన్‌మూర్తి, చెన్నా తిరుమలరావు, సంస్థ వ్యవస్థాపకుడు పట్నాల రాజారావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. నగరానికి చెందిన గాయకులు రాజారావు, పల్లా వెంకటేష్, శ్యాంసుందర్, ఎస్ఎస్ఎన్ రాజు, బొమ్మిడి సత్యనారాయణ, మహ్మద్ ఖాన్, శివకోటి జగదీష్, లోకేష్, దేవదాసు, రాము, వీవీఎస్ మూర్తి, గాయనీమణులు కందర్ప రాధ, గౌరీ, మాధురి, కుమారి, మను, శ్రీదేవి, జాస్మిన్, లయ, ఆదిలక్ష్మి తదితరులు అనేక యుగళగీతాలు ఆలపించారు. సోమేష్ బృందం వాద్య సహకారం అందించింది.

కేజీహెచ్ రోడ్లకు మహర్దశ



ఆంధ్రా మెడికల్ కాలేజీలో కొత్తగా వేస్తున్న రోడ్డు



నర్సింగ్ స్కూలు ఏరియాలో వేసిన రోడ్డు

మహారాణిపేట : కింగ్ జార్జి ఆస్పత్రిలో దెబ్బతిన్న రోడ్లకు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. అనేక ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 27 లక్షలు మంజూరు చేశారు. ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీపీ నాయుడు ఆధ్వర్యంలో డీఈఈ మన్మథరావు రోడ్ల నిర్మాణం చేపట్టారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ యూజీ హాస్టల్ నుంచి మార్చురీ వరకు, అలాగే నర్సింగ్ కాలేజీ ఏరియాలో రోడ్లను యుద్ధ ప్రాతిపాదికన నిర్మించారు. దాదాపు కిలోమీటర్ మేర రోడ్లు వేశారు. రోడ్లు బాగుపడటంతో వాహనచోదకులు, పాదచారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోడల్ స్లమ్ స్కీంకు 55వ వార్డు ఎంపిక

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు



55వ వార్డులో పర్యటిస్తున్న జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, సమన్వయకర్త కె కె.రాజు

కంచరపాలెం: మురికివాడల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న మోడల్ స్లమ్ స్కీంలో 55వ వార్డును ఎంపిక చేసినట్లు జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు తెలిపారు. వార్డులోని కంచరపాలెం పరిధి ధర్మానగర్, తిక్కవానిపాలెం ప్రాంతాల్లో గురువారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజుతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ మోడల్ స్లమ్ స్కీంలో డ్రైనేజీలు, కాలువల మరమ్మతులు, శ్మశానవాటికలు, సామాజిక భవన నిర్మాణాలు దశల వారీగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. వార్డులో పందుల బెడద ఎక్కువగా ఉందని, వీధిలైట్లు, పారిశుధ్య సమస్యలు ఎక్కువగా ఉన్నాయని స్థానికులు కమిషనర్ రాజుబాబు దృష్టికి తీసుకెళ్లారు. వార్డులో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించాలని ఆయన సూచించారు. సచివాలయ సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా ప్రాంతాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చూడాలని జోన్-5 ఇంజినీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ శశికళ, జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ ఐ.వి.రమణమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ (రెవెన్యూ) ఐ.బాబురావు, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, డీఈ భరణికుమార్, ఏఈ రమణమ్మ, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, ఎస్ఎస్ జనార్దన్, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.